తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
02 జూన్ 2026
Follow :

# ధాన్యం కొనుగోళ్లపై నిలదీసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రైతులతో కలిసి బైఠాయించిన అంజిరెడ్డి**

**దిగివచ్చిన అధికారులు**

లోపలి పేజీలో..









## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే**



**గద్వాల నడిగడ్డ, జూన్ 1 (జనం సాక్షి) :** జూరాల ప్రాజెక్టు, గుడ్డేందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 4న సీఎం రేవంత్ రెడ్డి ధరూరు మండలంలోని జూరాల ప్రాజెక్టు, గుడ్డేందొడ్డి రిజర్వాయర్, తదితర పరిశీలించడానికి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, వనపర్తి ఎస్పీ సునీత రెడ్డితో కలిసి ప్రాజెక్టు తదితర పరిసర ప్రాంతాల్లో హెలిపాడ్ నిర్మాణం, ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. జూరాల ప్రాజెక్టు సమీపంలోని రేవులపల్లి గ్రామం జెన్కో క్వార్టర్స్ లో, రామాలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో, తదితర ప్రాంతాల్లో హెలిపాడ్ ఏర్పాటు చేసేందుకు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెలిపాడ్ నుంచి ఆయా ప్రాజెక్టను సందర్శించే దారిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీస్ బందోబస్తు నియమించాలన్నారు. ఎక్కడైనా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ఉంటే సరి చేయించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన చోట బారికేడ్లతో పాటు ఇతర ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ పర్యటనలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పి మొగిలయ్య, ఇరిగేషన్ ఈఈ సంజీవ్ ప్రసాద్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, తదితరులున్నారు.



## జిల్లా వ్యాప్తంగా నెలరోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

**- యస్పి పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి, జూన్ 01(జనంసాక్షి):** శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి 30 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపట్టకూడదని హెచ్చరించారు. ఇట్టి విషయంలో జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసు వారికి సహకరించవలసిందిగా ఎస్పీ సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వరుగంటి శాస్త్రి



**సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి):** జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా నియామకమైన వరగంటి శాస్త్రి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యా సంస్థలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన శ్రీనివాస్ రెడ్డి స్థానంలో ఈయన హైదరాబాద్ ఆర్జెడి కార్యాలయం నుండి బదిలీపై జిల్లాకు వచ్చారు. నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వరగంటి శాస్త్రికి విద్యాశాఖ కార్యాలయ అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## గూడెం పాఠశాల అభివృద్ధికి పది లక్షల నిధులు

**- ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల కృతజ్ఞతలు**



**బెజ్జంకి,జూన్ 01,(జనంసాక్షి):**గూడెం గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్జీఎస్) నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి గ్రామప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు గూడెం గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థుల భద్రత,పాఠశాల అభివృద్ధి, గ్రామ విద్యా ప్రగతికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే సేవాభావం అభినంద నీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధే గ్రామాభివృద్ధికి పునాది అనే లక్ష్యంతో పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. అలాగే ఈ నిధుల మంజూరుకు సహకరించిన మండల నాయకులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

**- సర్పంచ్ పాకాల శ్రీనివాస్**



**నంగునూరు, జూన్ 1(జనంసాక్షి):** అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని సర్పంచ్ పాకాల శ్రీనివాస్ అన్నారు. ప్రతి నిరుపేద సొంత ఇంటి కల నెరవేరేలా ప్రయత్నిస్తామని ఉప సర్పంచ్ శామంతుల లాస్య సర్సింలు తెలిపారు. నంగునూరు మండలంలోని మగ్దూంపూర్ గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గౌతం,వార్డ్ సభ్యులు పాకాల రాకేష్,హరికిషన్, ఫీల్డ్ అసిస్టెంట్ పొలరవు పరమేశ్వర్ రెడ్డి,పంచాయతీ సిబ్బంది మధు పాల్గొన్నారు.

## వెల్దుర్తి తహసిల్దార్‌గా విజయలక్ష్మి పదవీ బాధ్యతల స్వీకరణ



**వెల్దుర్తి, జూన్ 1 (జనంసాక్షి):** వెల్దుర్తి తహసిల్దార్‌గా విజయలక్ష్మి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. వెల్దుర్తి ఇన్చార్జి తాసిల్దార్‌గా ఉన్న శ్రీనివాస్ డిప్యూటీ తాసిల్దారుగా విధుల్లో చేరారు. విజయలక్ష్మి గారు నర్సాపూర్ డివిజనల్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్గా నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహించగా సోమవారం వెల్దుర్తి తాసిల్దారుగా బాధ్యతలు చేపట్టడం జరిగింది వెల్దుర్తి మండల భూ సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని మండలంలో అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని ఆమె తెలిపారు.

## పేట నూతన తాసిల్దార్ బాధ్యతలు స్వీకరించిన నారాయణ



**పెద్ద శంకరంపేట, జూన్ 1 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల నూతన తాసిల్దార్ నారాయణ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సూపరిండెంట్ గా విధులు నిర్వహించి, పెద్ద శంకరంపేట నూతన తాసిల్దార్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో మండల ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని మండల ప్రజలకు తెలిపారు.తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది నూతన తాసిల్దార్ కు శాలువాతో సన్మానించారు.

## ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్నాం

**- పారిశుధ్య కార్మికుల ధర్నా**



**న్యాల్‌కల్, జూన్ 01, (జనంసాక్షి):** దశాబ్దాల కాలంగా ప్రాణాలను ఫణంగా పెట్టి పల్లెల్లో మెరుగైన పారిశుధ్యం కోసం నిరంతరంగా కృషి చేస్తున్నాం. ప్రభుత్వాలు, ప్రభుత్వ యంత్రాంగం మారుతున్న నేటికీ ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ.. న్యాల్ కల్ లోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం మండల సీఐటీయు కార్యదర్శి సంగయ్య ఆధ్వర్యంలో మండలంలోని పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేపట్టి, ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల వేళ పారిశుద్ధ్య కార్మికులకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలిపారు. నిరసన తెలిపిన వారిలో పారిశుద్ధ్య కార్మికులు జగదీశ్వర్, ఆనంద్, కిష్టన్న, మొగులన్న, భారతి, నరసమ్మ, శోభమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

**ఉర్కొండ జూన్ 01, (జనంసాక్షి);** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఉర్కొండ ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేవెల్లి గ్రామానికి చెందిన రంగ ప్రకాష్ కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడని భార్య ఇచ్చిన ఫిర్యాదులో ఎవరిపై అనుమానం లేనట్టు ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై రమాదేవి తెలియజేశారు.

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

**- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి**



**న్యాల్‌కల్, జూన్ 01, (జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడికి పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, హద్నూర్ సహకార సంఘం చైర్మన్ జగనాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మిర్జాపూర్ (బి) గ్రామం, కనీస ఫాతిమాకు చెందిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. కుటుంబ సభ్యులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులను ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, పార్టీ శ్రేణులు సామియల్, సమియోద్దీన్, మోహన్ రెడ్డి, విలాస్ రెడ్డి, వెంకటేశం, తుకారం, షేక్ సఫియోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## కడవేర్గు పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాలను కేటాయించాలి

**- టీయస్ యూటీఎఫ్ ఉపాధ్యాయుల డిమాండ్**



**చేర్యాల, జూన్ 01(జనంసాక్షి):** చేర్యాల మండలం కడవేర్గు ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాలను కేటాయించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం సూపరింటెంట్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలిహమ్మద్ తప్పెట్ల యాదగిరి మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలలలో పూర్వ ప్రాథమిక పాఠశాలలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వడం జరిగిందని, సిద్దిపేట జిల్లాలో 84 పాఠశాలలకు పూర్వ ప్రాథమిక పాఠశాలలు కేటాయించడం జరిగింది. అదే సందర్భంలో చేర్యాల మండలంలో కడవేర్గు ప్రాథమిక పాఠశాల అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు కలిగి, మన ఊరు మన బడి కార్యక్రమంలో 100శాతం పనులు పూర్తి చేసిన పాఠశాలగా చేర్యాల మండలంలో విద్యార్థుల సంఖ్య పరంగా రెండవ అతిపెద్ద ప్రాథమిక పాఠశాల ఉండడం జరిగిందని, అటువంటి పాఠశాలలను ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించల్సిన అవసరం ఉందని ,అన్ని అర్హతలు కలిగిన కడవేర్గు పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాలను కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. జిల్లా విద్యా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని కడవేర్గు ప్రాథమిక పాఠశాలకు పూర్వ ప్రాథమిక పాఠశాలను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కృష్ణ,జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్, టి.శివలింగం, ఎఫ్ డబ్ల్యూ కన్వీనర్ చేర్యాల రామచంద్రం, జిల్లా కమిటీ సభ్యులు జక్కుల నర్సింహులు, పిల్లి రాజు పాల్గొన్నారు.





# ఉద్యమ స్ఫూర్తి అభివృద్ధి ప్రతిరూపం భూషణం

## ఉద్యమ యోధుడి నుంచి ఆదర్శ సర్పంచ్‌గా భూషణం

- తెలంగాణ కోసం జైలు జీవితం..గ్రామాభివృద్ధికి ప్రజానేత
- పశువుల కాపరి నుంచి ఉద్యమ యోధుడిగా ప్రస్థానం
- తెలంగాణ కోసం జైలు గోడలు చూసిన యోధుడు



**రాజోలి, జూన్ 1 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలోని మారుమూల గ్రామం పడమటి గార్లపాడు. ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ గ్రామం నేడు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఆ మార్పు వెనుక ఉన్న వ్యక్తి పేరు భూషణం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వీధుల్లో పోరాడిన యోధుడు..జైలు జీవితం అనుభవించిన ఉద్యమకారుడు. అనంతరం గ్రామ ప్రజల కోసం అహర్నిశలు శ్రమించిన ప్రజానాయకుడు. 1976లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన భూషణం చిన్నతనం నుంచే కష్టాల మధ్య పెరిగాడు. పాఠశాల కంటే పశువుల మందే అతనికి ఎక్కువగా కనిపించేది. పశువులను మేపుతూ కుటుంబానికి అండగా నిలిచిన భూషణం, జీవితంలో ఏదో సాధించాలని కలలు కన్నాడు. 1997లో వివాహం అనంతరం కుటుంబ బాధ్యతలు పెరిగినా, సమాజం కోసం పనిచేయాలనే తపన మాత్రం తగ్గలేదు. అదే సమయంలో తెలంగాణ ఉద్యమం ప్రజల్లో చైతన్యం నింపుతోంది. ప్రాంతీయ అసమానతలు, నిరుద్యోగం, అభివృద్ధి లోపాలు చూసిన భూషణం తెలంగాణ రాష్ట్ర సాధనే పరిష్కారమని నమ్మాడు.

**ఉద్యమంలో తొలి అడుగు**

2003లో తెలంగాణ ఉద్యమంలో అడుగుపెట్టి తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేశాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బుక్కెం కిషన్ నాయక్ ఆధ్వర్యంలో పనిచేస్తూ ఉమ్మడి వడ్డేపల్లి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు. గ్రామం నుంచి గ్రామానికి తిరుగుతూ తెలంగాణ అవసరాన్ని ప్రజలకు వివరించాడు. ఉద్యమ జ్వాలను ప్రజల్లో రగిలించాడు. 2011లో తెలంగాణ ఉద్యమం ఉద్ధృత రూపం దాల్చినప్పుడు భూషణం పోరాటం మరింత వేగం అందుకుంది. రాస్తారోకోలు, సడక్ బంద్‌లు, వంటావార్పులు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, రైల్ రోకోలు ఏ కార్యక్రమం జరిగినా భూషణం ముందు వరుసలో ఉండేవాడు. తెలంగాణ నినాదాలతో వీధులను హోరెత్తించేవాడు. ఒక దశలో ఉద్యమం తీవ్రస్థాయికి చేరింది. జోగులాంబ రైల్వే హాల్ట్ వద్ద నిర్వహించిన రైల్ రోకో కార్యక్రమం సంచలనంగా మారింది. రైలు పట్టాలపై కూర్చొని తెలంగాణ కోసం నినాదాలు చేసిన ఉద్యమకారుల్లో భూషణం కూడా ఉన్నాడు. పోలీసులు రంగంలోకి దిగి ఆయనను అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు. జైలు గోడల మధ్య ఉన్నప్పటికీ భూషణం ఆత్మస్థైర్యం కోల్పోలేదు. “తెలంగాణ వచ్చేదాకా పోరాటం ఆగదు” అనే సంకల్పంతో ముందుకు సాగాడు. ఉద్యమం కోసం జైలు జీవితం అనుభవించిన యోధుడిగా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు.

**ఉద్యమ స్ఫూర్తితో అభివృద్ధి బాటలో**

చివరకు 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఎన్నో ఏళ్ల కల సాకారమైంది. ఉద్యమకారుల కళ్లలో ఆనందభాష్పాలు కనిపించాయి. ఆ రోజు భూషణం జీవితంలో మరచిపోలేని క్షణంగా నిలిచిపోయింది. రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా ఆయన ప్రజల మధ్యే ఉన్నాడు. ఉద్యమ నాయకుడిగా కాకుండా అభివృద్ధి నాయకుడిగా మారాడు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న భూషణం 2018లో పడమటి గార్లపాడు గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇచ్చాడు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యాలు, పరిశుభ్రత కార్యక్రమాలు, పచ్చదనం పెంపు, మౌలిక వసతుల కల్పన వంటి ఎన్నో పనులు చేపట్టి గ్రామ రూపురేఖలను మార్చివేశాడు. ఒకప్పుడు వెనుకబడిన గ్రామంగా ఉన్న పడమటి గార్లపాడు, నేడు అభివృద్ధి నమూనాగా నిలిచింది. గ్రామంలో జరిగిన మార్పులను చూసేందుకు వచ్చిన అప్పటి గద్వాల జిల్లా కలెక్టర్ శశాంక గ్రామాన్ని పరిశీలించి, ‘ఇది గ్రామం కాదు. మినీ బెంగుళూరు” అని ప్రశంసించినట్లు భూషణం గుర్తు చేసుకుంటారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న భూషణం, ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. పశువుల కాపరిగా మొదలైన జీవితం.. తెలంగాణ ఉద్యమ యోధుడిగా ఎదిగి, చివరకు గ్రామాభివృద్ధి శిల్పిగా నిలిచిన భూషణం జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం.

> 2011లో తెలంగాణ ఉద్యమం ఉద్ధృత రూపం దాల్చినప్పుడు భూషణం పోరాటం మరింత వేగం అందుకుంది. రాస్తారోకోలు, సడక్ బంద్‌లు, వంటావార్పులు, ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, రైల్ రోకోలు ఏ కార్యక్రమం జరిగినా భూషణం ముందు వరుసలో ఉండేవాడు.



# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**- అంగరంగ వైభవంగా ముస్తాబైన జిల్లా పోలీస్ కవాతు మైదానం**

**- జిల్లా కలెక్టర్‌తో కలిసి పరేడ్ మైదానాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్**





**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 1 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న నిర్వహించనున్న అధికారిక వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్‌తో కలిసి జిల్లా పోలీస్ కవాతు మైదానాన్ని పరిశీలించిన ఎస్పీ, పరేడ్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అతిథుల కోసం కల్పించిన సౌకర్యాలు తదితర అంశాలను సమీక్షించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అనుగుణంగా కవాతు మైదానాన్ని ప్రత్యేకంగా అలంకరించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

నాగర్‌కర్నూల్ జిల్లా ఏర్పడినప్పటి నుంచి తొలిసారిగా ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవ పరేడ్‌లో మహిళా పోలీస్ సిబ్బందితో ప్రత్యేక కవాతు ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. మహిళా పోలీస్ కంటింజెంట్ పాల్గొనడం ఈ వేడుకల ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ పరేడ్‌ను ఆర్ఎస్ఐ లలిత ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి పోలీస్ శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఎస్పీ వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

## ఖిల్లా

## అటవీ శాఖ అధికారి మంజుల బదిలీ

**- ఘనంగా సత్కరించిన నాయకులు ఆగారం ప్రకాష్**



**ఖిల్లా ఘనపురం 1, జూన్, (జనంసాక్షి):** ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ మంజుల బదిలీ అయిన సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగారం ప్రకాష్ ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి వీడుకోలు పలికారు అనంతరం ఆగారం ప్రకాష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో , ప్రజలతో ఎంతో సమన్వయంతో ఉంటూ, నిరంతరం అంకితభావంతో పనిచేసిన మంచి అధికారిగా మంజుల మేడం ఆమె మనందరి మనసుల్లో నిలిచిపోతారు అని భవిష్యత్తులో ప్రమోషన్లతో మరెన్నో ఉన్నత పదవులు అవరోధించాలని ప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు లింగ స్వామి, వనపర్తి జిల్లా వికలాంగుల అధ్యక్షులు రమేష్, నాగేష్, గోవింద్, రాములు,యాదగిరి, గౌస్, మహేష్,ఫారెస్ట్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత




**రేవల్లి, జూన్ 01 (జనంసాక్షి):** గోపాల్‌పేట మండల పరిధిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం 07:00 గంటల సమయంలో కానిస్టేబుల్ కె. నాగరాజు విధి నిర్వహణలో భాగంగా గస్తీ తిరుగుతుండగా, చెన్నూరు వాగు వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరును గుర్తించారు. సదరు డ్రైవర్ కం ఓనర్ ధనవాడ నాగరాజును అడ్డుకుని అనుమతి పత్రాల కోసం ఆరా తీయగా, అతను ఎటువంటి పత్రాలు చూపలేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు అక్రమ ఇసుక రవాణాకు ఉపయోగిస్తున్న ట్రాక్టరును ఇంజిన్ చాస్సిస్ నంబర్ ఎంబీఎన్ఏ డబ్ల్యూ53 ఏసియన్ సీఎం997, ట్రాల్లి చాస్సిస్ నంబర్ : పిఇసిఎన్ఎంబిఎన్ఆర్ 5TTT 2907200708 నంబర్ గల ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గోపాల్‌పేట ఎస్సై డి.శశిధర్ వెల్లడించారు.

## గ్రామపంచాయతీ కార్మికుల నాలుగు నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి

**- గ్రీన్ బడ్జెట్ ద్వారా నేరుగా జిపి వర్కర్స్ అకౌంట్లో జీతాలు వేయాలి**

**- మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి**

**- ఈ ఎస్ ఐ, పి ఎఫ్ సౌకర్యం కల్పించాలి**

**- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏం.శంకర్ నాయక్**



**అచ్చంపేట రూరల్, జూన్ 01 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన గ్రామ పంచాయతీల పనిచేస్తున్న కార్మికుల బతుకులు మాత్రం మారటం లేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం శంకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. అచ్చంపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి గ్రీన్ బడ్జెట్ ద్వారా వారి వేతనాలు చెల్లిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని ఇచ్చిన హామీ గడిచి కూడా రెండు సంవత్సరాలు పూర్తవుతున్న పంచాయతీ కార్మికులను పట్టించుకునే పరిస్థితి లేదని వారు అన్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్మికులను గుర్తించి కనీస వేతనాన్ని అమలు చేసి 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్ చేశారు కార్మికులకు ప్రమాద భీమ సౌకర్యము 20 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు ఈఎస్ఐపీఎఫ్ సౌకర్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం శంకర్ నాయక్ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాలస్వామి ఏమయ్యా, నాయకులు విష్ణు, నాసరయ్య ధర్మ మల్లేష్ లచ్చమ్మ హుస్సేన్ అమ్మ సరిత పద్మ తదితరులు ఉన్నారు.

# నాగర్‌కర్నూల్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత

**- బంకుల వద్ద బారులు తీరిన వాహనాలు-ఆందోళనలో రైతులు**



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 1 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా కనిపిస్తోంది. జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల వద్ద ఇంధనం కోసం వాహనదారులు పెద్ద సంఖ్యలో క్యూ కట్టారు. ఉదయం నుంచే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు బంకుల వద్ద బారులు తీరడంతో రద్దీ వాతావరణం నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో ఇంధనం పూర్తిగా అయిపోవడంతో బంక్ యాజమాన్యాలు నో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేశాయి. వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న ఈ సమయంలో డీజిల్ కొరత రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలకు డీజిల్ అందకపోవడంతో పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక బంక్‌లో ఇంధనం లేదని తెలిసి మరో బంక్‌కు వెళ్లినా అక్కడ కూడా అదే పరిస్థితి ఎదురవుతోందని వాహనదారులు చెబుతున్నారు.ఇంధనం అందుబాటులో ఉన్న కొన్ని బంకుల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. పెట్రోల్, డీజిల్ నిల్వలు ఎప్పుడు వస్తాయో స్పష్టమైన సమాచారం లేకపోవడంతో వాహనదారుల్లో అయోమయం నెలకొంది. అత్యవసర అవసరాల కోసం ప్రయాణించాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇంధన సరఫరాలో తాత్కాలిక అంతరాయం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని, త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకుని జిల్లాలో ఇంధన సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**- ఏరియా ఆసుపత్రిలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**



**జడ్చర్ల, జూన్ 1 (జనంసాక్షి):** జడ్చర్ల ఏరియా ఆసుపత్రి పనితీరును, రోగులకు అందుతున్న సేవల నాణ్యతను అంచనా వేయడానికి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సోమవారం ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. తనిఖీ సమయంలో ఔట్ పేషెంట్ (ఓపీ) రిజిస్ట్రేషన్, రోగుల రికార్డులు మరియు సిబ్బంది హాజరు వివరాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సంరక్షణ సేవల లభ్యతపై ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో పాముకాటు సంఘటనలు పెరిగే అవకాశం ఉన్నందున, బాధితుల చికిత్సకు అవసరమైన పాముకాటు విరుగుడు ఇతర అత్యవసర మందుల లభ్యతను అదనపు కలెక్టర్ ప్రత్యేకంగా ధృవీకరించారు. ఆస్పత్రిలో అన్ని సమయాల్లోనూ తగినంత మందుల నిల్వలు ఉండేలా చూడాలని, అత్యవసర చికిత్స సౌకర్యాలు పూర్తిగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం, వార్డులు, మరుగుదొడ్లు, రోగులు వేచి ఉండే ప్రదేశాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా నివారించడానికి రోగులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ అందించడానికి ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచడం ఎంతో ముఖ్యమని, ప్రజల ప్రయోజనం కోసం ఆసుపత్రిలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని తక్షణమే సరిదిద్ది, నిరంతర వైద్య సేవలు, సరైన మందుల లభ్యత, ఉన్నత ప్రమాణాల పారిశుధ్యాన్ని నిర్ధారించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు.

## త్యాగాల తెలంగాణ

**అయిజ,జూన్ 1(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ఎంతో మంది నాయకులు, విద్యార్థులు, మహిళల,త్యాగమూర్తుల బలిదానం జూన్ 2తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సందర్భం. తెలంగాణ ఉద్యమ కారుల త్యాగాలు మరువలేనివని, రక్తం, చెమట, కన్నీటి ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న ప్రతి అమరవీరుడు,ఉద్యమకారుడు గౌరవించబడాలని తూముకుంట కృష్ణన్న డిమాండ్ చేశారు.కుటుంబాల సంక్షేమం,ఉద్యమకారుల గుర్తింపు,వారికి తగిన సదుపాయాలు కల్పించడం తెలంగాణ ప్రభుత్వ బాధ్యతాయని,తెలంగాణ కోసం పోరాడిన వారి సేవలను చరిత్ర ఎప్పటికీ మరవదని, జైతెలంగాణ తెలంగాణ అమరవీరుల, తెలంగాణ ఉద్యమం, తెలంగాణ ఆవిర్భావం. ప్రజాస్వామ్యకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గద్దర్ ఆధ్వర్యంలో 1997 లో ఏర్పడి ప్రజాస్వామ్యకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తూమ్ కుంట కిష్టన్న,విద్యార్థి ఉద్యమంలో కీలకంగా పనిచేసి, తెలంగాణ జనసభ, తెలంగాణ స్టూడెంట్ ఫ్రెండ్ తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్, తెలంగాణ రాష్ట్రం కోసం 1997 సంవత్సరం 610 జీవో 610 జీవో, నీళ్లు నిధులు నియామకాలు, ఆంధ్రుల దోపిడీ విధానం పోవాలని తెలంగాణ యాస భాష సంస్కృతిని కాపాడాలని ,1969 లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం 360 మంది విద్యార్థుల్లో త్యాగమూర్తుల బలిదానం,స్ఫూర్తితో మలిదశ తెలంగాణ పోరాటం నడిగడ్డ గద్వాల ప్రాంతంలో పాశం సర్వారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థి, తెలంగాణ రాష్ట్రం కోసం నిస్వార్థమైన త్యాగాన్ని మరవలేనిదని,గద్వాల పట్టణంలో మూడవ తరగతి చదువుతున్న వేణుగోపాల్ పాత పోస్ట్ ఆఫీస్ దగ్గర ఉద్యమానికి తీవ్రస్థాయిలో పోరాటం కొనసాగుతున్న క్రమంలో ఆంధ్ర పోలీసులు పాలకవర్గాలు, తుపాకి తూటాలకు బలైనారని, విషయాలు **'జనంసాక్షికి'** తెలియజేశారు.

## పేటలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 1(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మాణాలు పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇండ్లను సోమవారం జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రారంభించారు. పేట మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఉజ్జెల్లీ నర్సమ్మ, 4వ వార్డులో వర లక్ష్మి, 9వ వార్డులో దాసరి కమలశ్రీ లకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పుర చైర్ పర్సన్ కొండాశ్వేతా సత్య యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులు కలెక్టర్ తో పాటు అతిథులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటి ప్రవేశం చేసిన వేళ లబ్ధిదారులకు కలిగిన అనుభూతి, వారి పిల్లలు, చదువు, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్య క్రమంలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, పుర వైస్ చైర్‌పర్సన్ మంజుల, వార్డు కౌన్సిలర్లు మహేశ్, గొల్ల రవితేజ యాదవ్, రాజేష్ ఘట్, హౌసింగ్ ఏఈ గౌస్, వార్డు ఆఫీసర్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణలో ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్, జూన్ 1 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి.పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి వచ్చిన 02 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 01, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 01 స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## ఉద్యమకారుల గుర్తింపు అవసరం



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి జూన్ 1 (జనంసాక్షి):** 1969 - 2001 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల్లో పాల్గొని,రాష్ట్ర సాధన కోసం పోరాడినఅమరుల కుటుంబాలకు పోలీసు కేసులున్న వారిపై మరియు కమిటీ ద్వారా నిర్ణయింప బడిన వారికి మాత్రమే ప్రభుత్వము ద్వారా సహాయం పొందేందుకు అర్హులని తెలుపడం జరిగిందని,ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు 1969లో గద్వాల ప్రాంత వాసి పాశం సర్వారెడ్డి మరియు కొట్టం వేణుగోపాల్ పోలీస్ తూటాలకు బలియైన సందర్భంలో ఉస్మానియ యూనివర్సిటీ అనుబంధం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరంతర క్లాసులను బహిష్కరిస్తూ మరియు 1970 సం:లో తుది సంవత్సరంలో పరీక్షలను కూడా బహిష్కరిస్తూ వారి భవిష్యత్తు అందాకారంలో ఉన్న దాన్ని కూడా పరిగణలోనికి తీసుకోవాలని వారికి, వారి కుటుంబాలకు ప్రభుత్వ గుర్తింపు గాని, ఎక్స్రేషియా పొందేవిధంగా విధివిధానలను నిర్ణయించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం, జోగుళాంబ గద్వాల జిల్లా కమిటీకి విన్నవించిందని,1969 నాటి ఉద్యమకారులను 'తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులు'గా గుర్తించి,వారికి 'స్వతంత్రత సైనిక్ సమ్మాన్' పథకం కింద ప్రత్యేక పింఛన్లు అందించాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఓ వినతిపత్రం సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్రావు, బీసీ నేత రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అచ్చన్న గౌడ్ ఇచ్చారు.

## పేదల సొంతింటి కల సాకారం

**- ఘనంగా ఇందిరమ్మ గృహప్రవేశాలు**
**- ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కదిరే శేఖర్ యాదవ్**

**ఉర్కొండ జూన్ 01, (జనంసాక్షి);**



ఇందిరమ్మ గృహప్రవేశాలతో పేదల సొంతింటి కల సాకారం అయిందని గ్రామ సర్పంచ్ శేఖర్ యాదవ్ తెలిపారు. ఉర్కొండ మండలంలోని జకినాలపల్లి గ్రామ పంచాయతీలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాల కార్యక్రమములో సోమవారం రోజు గ్రామంలోని లబ్ధిదారులు మల్లెకేడి అమృతా బాయి ,తలసాని అరుణ ,కమ్మంపాటి చిట్టెమ్మ ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాల కార్యక్రమములో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ లు పోలే చంద్రయ్య, కృష్ణారెడ్డి , పంచాయతీ సెక్రెటరీ ముస్తఫా, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భద్రతా ఏర్పాట్లు : జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 1(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరి రక్షించేందుకు నారాయణ పేట జిల్లా పోలీసులు విస్తృ త భద్రతా చర్యలు చేపట్టారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా ఈరోజు నారాయణ పేట జిల్లా కేంద్రంలోని ముఖ్య ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ బృందం, పోలీసు జాగిలాల సహాయంతో సమగ్ర తనిఖీలు నిర్వహించారు.
ఈ తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణ, బస్టాండ్, ప్రధాన చౌరస్తా, జనసమ్మర్ధం అధికంగా ఉండే ప్రాంతాలు మరియు ఇతర ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పేలుడు పదార్థాలు లేదా ఇతర అనుమానాస్పద వస్తువులు ఉన్నాయా అనే కోణంలో ప్రతి ప్రాంతాన్ని ప్రత్యేక పరికరాలతో తనిఖీ చేశారు.జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ అన్ని అవసరమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలు కూడా అప్ర మత్తంగా ఉండాలని, ఎక్క డైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, సంచులు లేదా వాహనాలు కనిపించి నట్లయితే వాటిని తాకకుండా వెంటనే సమీప పోలీసు అధికారులకు లేదా డయల్-100 కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే ప్రజలు వదంతులను నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతిభ ద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అందరూ సంతోషంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ తనిఖీలలో బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

**ఉర్కొండ జూన్ 01, (జనంసాక్షి);**
ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి వద్ద ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. షాద్నగర్ నుంచి శ్రీశైలం వెళ్తున్న బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టింది. ఘటనలో రాజేశ్ (30), సాయి (28), కృష్ణారెడ్డి (30) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్కు తరలించినట్లు 108 సిబ్బంది పైలట్ రమేశ్, ఈఎంటీ స్వామి తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**- టిజిఐఐసి చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి**



**కంది, జూన్ 01(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని టిజిఐఐసి చైర్మన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కంది మండలంలోని కౌలంపేటలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ళు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గం ప్రత్యేకాధికారి జ్యోతి లక్ష్మి, మండల ప్రత్యేకాధికారి తుల్చా నాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ స్వాతిశ్రీశైలం, హౌసింగ్ ఏఈ సుమ, ఉపసర్పంచ్ వీరమణి, వార్డు సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ చేర్యాల ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ నాయక్, మండల అధ్యక్షులు మొగులయ్య, మోతిలాల్, కలిసి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంగినేనిపల్లి గ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



**వీపనగండ్ల, జూన్ 2 (జనంసాక్షి) :** వీపనగండ్ల మండలం సంగినేనిపల్లి గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రతిపాదిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యామ్, గ్రామ సర్పంచ్ పల్ల జయంతి, గ్రామ పెద్దలు పరిశీలించారు.ఈ సందర్భంగా ప్లాంట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న స్థల పరిస్థితులను, అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు పరిశీలించి భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు ఎంతగానో ఉపయోగపడుతుందని గ్రామ పెద్దలు అభిప్రాయ పడ్డారు. ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ గౌడ్, వేణుమాధవ్ రెడ్డి, ఉడుత మౌలాలి,చందన్ గౌడ్,సురేష్ రెడ్డి,కురుమయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో గ్రామా సర్పంచ్‌కు అవమానం



**పెద్దాపూర్ జూన్ 1 (జనంసాక్షి):** పెద్దాపూర్ సర్పంచ్ వంగసాయి బాబు గౌడ్ ఉప్పునుంతల జనంసాక్షి:మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామం తో పాటు వివిధ గ్రామాలలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశం చేయడము జరిగినది పెద్దాపురం గ్రామంలో చిటికెల మైబు,అను లబ్ధిదారుడు నూతన గృహప్రవేశం ప్రభుత్వ అధికారికంగా ఈరోజు చేయడం జరిగినది కానీ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన సర్పంచ్ నాకు ఏమాత్రం ఇన్ఫర్మేషన్ లేకుండా కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంత ఎజెండాతో బీసీ నినాదం అని చెప్పుకునే వాళ్ళు ఒక బీసీ బిడ్డనైన నన్ను చిన్నచూపు చూసి ఉప సర్పంచ్ తోటి ఓపెనింగ్ చేపించి నన్ను అవమానించడం సరైన పద్ధతి కాదు గతంలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఉప్పునుంతల మండలంలో కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా ఉన్న సర్పంచులు కూడా గ్రామాలలో ఉన్నారు ప్రభుత్వ కార్యక్రమాలకు సర్పంచులు వచ్చినా రాకున్నా వారికి సమాచారం చేరవేసి కార్యక్రమం చేయడం జరిగేది కొందరు స్వార్థ రాజకీయాలు చేస్తూ ఒక గ్రామ ప్రథమ పౌరుడిని రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులను కాలరాస్తూ కొందరు రాజకీయ పలుకుబడితో ఒక సర్పంచినే ఈ విధంగా అవమానానికి గురి చేస్తే ప్రజాస్వామ్యంలో ప్రజల పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇలాంటి సంఘటనలు పునరావితం కాకుండా సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టాలని వారు కోరారు.

# కలెక్టరేట్‌లో ప్రజావాణికి 23 ఫిర్యాదులు



**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 1(జనంసాక్షి):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదుల ను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 23 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశం**



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 1 (జనంసాక్షి):** భూభారతి సదా భయానా సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ జిల కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూ భారతి, సాదా బైనామా, ఎస్ఐఆర్ ప్రగతిపై మండలాల వారీగా చర్చించారు. వీటితోపాటు ప్రజావాణి ఫిర్యాదులను వారం లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. నారాయణ పేట, మక్తల్ నియోజక వర్గాలలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ బూత్‌స్థాయి ఏజెంట్ల జాబితాలు ఇచ్చారా లేదా అని ఎన్నికల విభాగం అధికారులను ప్రశ్నించారు. మక్తల్ నియోజక వర్గంలో ఆయా పార్టీల ప్రతినిధులు తమ బూత్‌స్థాయి ఏజెంట్ల వివరాలు ఇచ్చారని, నారాయణ పేట నియోజక వర్గంలో ఇంకా అన్ని పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాలు ఇవ్వలేదని సెక్షన్ అధికారిని జయసుధ కలెక్టర్ కు తెలిపారు. వెంటనే రెండు నియోజక వర్గాలలో అన్ని పార్టీల బీఎల్ఏల జాబితాలు తప్పనిసరిగా తెప్పించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రాజేశ్వరి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# నాలుగు రోజుల్లో పూర్తి చేయండి

**- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఆదేశాలు**
**- ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**నర్సాపూర్ జున్ 1 (జనంసాక్షి):** నాలుగు రోజుల్లో ధ్యానం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారులను అదేశించారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నాను. 20 రోజులుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చిన ఇంతవరకు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వెంటనే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫోన్ మాట్లాడారు.. వచ్చే నాలుగు రోజుల్లో రోజుకు నాలుగు లారీల చొప్పున పంపించి ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేశం, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బచ్చేష్ యాదవ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భూమి వివాదం, బెదిరింపులు మానసిక ఒత్తిడితో వ్యక్తి ఆత్మహత్య

**- బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు**



**చౌట్కూర్ , జూన్ 01 (జనంసాక్షి):** మండలంలోని గ్రామానికి చెందిన పంతులు యాదమ్మ భర్త శ్రీశైలం వయస్సు 57 సం కుటుంబం గతంలో కొనుగోలు చేసిన ఐదు గుంటల భూమి విష యంలో కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. ఆ భూమిలో నివాస గృహం నిర్మించుకుని నివసిస్తున్నప్పటికీ, కొందరు వ్యక్తులు తమ పేరుపై ఉన్న స్థలాన్ని ఖాళీ చేయాలని, లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తరచూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో మే 31న ఉదయం శ్రీశైలం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అయితే ఆయన ఆచూకీ లభించలేదు. జూన్ 1న ఉదయం గ్రామస్తులు సమీపంలోని వ్యవసాయ భూమిలో ఉన్న వేప చెట్టుకు శ్రీశైలం ఉరివేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న స్థానిక మండల ఎమ్మార్వో కిష్టయ్య ఆర్ ఐ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై విశ్వజన్ తెలిపారు.

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 1 (జనంసాక్షి):** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ ఆక్ట్, జూన్ నెల 30 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావే శాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజ లు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించ డానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను,మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీచేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్య క్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.



# నాలుగో తేదీన మక్తల్‌కు సీఎం రాక

**- ప్రాంత ప్రాజెక్టులపై ఏరియల్ సర్వే నిర్వహించనున్న సీఎం, మంత్రుల బృందం**

**మక్తల్, జూన్ 01 (జనంసాక్షి):** ఈ నెల నాలుగో తేదీన మక్తల్‌కు సీఎం రేవంత్ రెడ్డి రానున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. నాల్గవ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ఏరియల్ సర్వే ద్వారా కొడంగల్ ఎత్తిపోతల పథకంతో పాటు కృష్ణ , భీమా నదులపై దాదాపు 1000 కోట్లతో నూతనంగా చేపట్టబోయే మూడు కొత్త బ్రిడ్జికం బ్యారేజ్ లకు సీఎం రేవంత్ రెడ్డి తో పాటు కర్ణాటక మంత్రి బోసురాజు మంత్రి ఉత్తం వాకిటి శ్రీహరి ఏరియల్ సర్వేలు చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతోపాటు ముంపు గ్రామాలైన నేరడగం, భూత్పూర్ లను సైతం ఏరియల్ సర్వేలో ముఖ్యమంత్రి పరిశీలిస్తారని అన్నారు. నూతనంగా కృష్ణాభిమానుదులపై ఇరు రాష్ట్రాల సహకారంతో చేపట్టబోయే కొత్త ప్రాజెక్టులతో ఉత్తర ప్రాంతానికి దాదాపు 6 నుంచి 8 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని, ఈ ప్రాంతం సస్య శ్యామలంగా మారుతుందని అన్నారు. బాబు 100 కోట్ల రూపాయల తో ముంపు గ్రామాలకు పునరావాసం కల్పిస్తున్నామని అన్నారు. ఎన్నికైన కొన్ని రోజుల్లోనే సంగంబండ రాయిని పగులగొట్టి ఆ పరిధిలోని



గ్రామాలకు సాగునీరు అందించామని అన్నారు. నర్వా మండలం జంగం రెడ్డి పల్లె వద్ద కొత్త లిఫ్ట్ సైతం త్వరలో ప్రారంభించుకుంటున్నామని సూచించారు.
ప్రెస్‌మీట్‌లో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్, ఇరిగేషన్ ఎస్ ఈ శ్రీధర్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యాన్ని కాల్చి నిరసన వ్యక్తం చేసిన రైతులు



**టేక్మాల్, జూన్ 1 (జనంసాక్షి):** టేక్మాల్ గ్రామ ప్రధాన రహదారిపై రైతులు ధాన్యాన్ని కాల్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకుండా ఆలస్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో రియాజుద్దీన్, పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని త్వరలో కొనుగోలు ప్రక్రియ చేపడతామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు. నిరసన కార్యక్రమంలో నాయకులు నాయి కోటి భాస్కర్, కమ్మరి సిద్దయ్య, జయవర్ధన్, కిషన్, సత్యం, రాఖీ,రైతులు పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయురాలుగా పద్మ

**పాపన్నపేట, జూన్ 1 (జనంసాక్షి):** యూసుఫ్ పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా బెండల పద్మ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు హెడ్మాస్టర్ గా పని చేసిన మాలతీదేవి ఇటీవల పదవి విరమణ చేశారు. దీంతో పద్మ ప్రధానోపాధ్యాయురాలుగా మాలతీ దేవి నుండి చార్జి తీసుకున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి



**- నర్సాపూర్ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ**
**- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**నర్సాపూర్ జూన్ 1 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులను సందర్శించి, అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో, వారి సహాయకులతో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారా? మందులు బయటకు రాస్తున్నారా? ఆసుపత్రి సిబ్బంది ప్రవర్తన ఎలా ఉంది? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం విద్యా, వైద్యనికి 60% శాతం నిధులు ఖర్చు చేస్తుందన్నారు. పేద ప్రజలకు ఎన్ హెచ్ ఎం కింద ప్రభుత్వ ఆసుపత్రిల్లో నిధులు ఖర్చు చేసేది కేంద్ర ప్రభుత్వమే అని అన్నారు. ప్రభుత్వం పేదల వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, దానికి తగ్గట్టుగా సేవలు అందాలన్నారు. విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో స్పందించి, నాణ్యమైన వైద్యం అందించి అండగా నిలవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్, అర్బన్ జూన్ 01 (జనంసాక్షి):** జూన్ 2న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు ఏర్పాటు చేస్తున్న కుర్చీలు, నీడ కొరకు ఏర్పాటు చేసిన టెంట్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శన స్టాళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో, అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుతున్నారని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ద్వారా ఏర్పాటుచేస్తున్న స్టాళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ నవీన్, జిల్లా పరిపాలన అధికారి సువర్ణరాజు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమేష్ కుమార్



**తూప్రాన్, జూన్ 1.(జనంసాక్షి):**
తూప్రాన్ మున్సిపల్ నూతన కమీషనర్‌గా కె.రమేష్ కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టడం జరిగింది. గతంలో కమిషనర్ గా విధులు నిర్వహించిన పాతూరి గణేష్ రెడ్డి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో నూతన కమిషనర్ గా ఛార్జ్ తీసుకోవడం జరిగింది, ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

**- సోమశిల, నార్లాపూర్, ఉయలవాడ ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జూన్ 1(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల సందర్శన నిమిత్తం ఈనెల 4,5 తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్‌సింగ్ జీ.పాటిల్‌తో కలిసి కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సోమశిల, నార్లాపూర్ ప్రాంతాలతో పాటు నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని ఉయాలవాడ ప్రాంతాలను సందర్శించి ముందస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మొదట సోమశిలలోని హరిత గెస్ట్ హౌస్‌ను సందర్శించిన అధికారులు, ముఖ్యమంత్రి బస చేయనున్న గదులు, సమావేశ మందిరాలు, విశ్రాంతి సదుపాయాలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల సమీక్షా సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరిశీలించారు. హరిత గెస్ట్ హౌస్ పరిసర ప్రాంతాలు, ప్రవేశ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, సమావేశ ప్రాంగణంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు.



పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ రాకపోకల దృష్ట్యా ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్ స్థలాన్ని కూడా పరిశీలించిన అధికారులు, అక్కడ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకల నిర్వహణకు సంబంధించిన చర్యలపై సూచనలు చేశారు. హెలిప్యాడ్ నుంచి పర్యటన ప్రాంతాలకు వెళ్లే రహదారుల మరమ్మతులు, శుభ్రత పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులను ఆదేశించారు.

అనంతరం నార్లాపూర్‌లోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-3 పనులను పరిశీలించారు. ముఖ్యమంత్రి ఈ పర్యటనలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ స్టేజ్-3 పనులను ప్రత్యక్షంగా పరిశీలించనున్న నేపథ్యంలో అక్కడి పనుల పురోగతి, సందర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తెలంగాణ రాష్ట్రంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టులలో ఒకటిగా ఉన్నందున, ప్రాజెక్టు పనుల పురోగతికి





సంబంధించిన పూర్తివివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఉయాలవాడలో నూతనంగా నిర్మించిన నీటిపారుదల శాఖ కార్యాలయ సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడి హెలికాప్టర్ ఏర్పాట్లను కూడా పరిశీలించారు. అనంతరం కుమ్మెర ప్రాంతంలోని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌సీ పార్థసారథి, ఆర్డీఓ బన్సీలాల్, నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్‌బాబు, డీఎస్పీ శ్రీనివాస్, తహసీల్దార్ మాధవి, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్‌తో పాటు పోలీసు, రెవెన్యూ పాల్గొన్నారు.

# తూప్రాన్ పిఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి రాజీనామా

**- తూముకుంట నర్సారెడ్డి లక్ష్యంగా తీవ్ర విమర్శలు.**
**- గజ్వేల్ కాంగ్రెస్‌లో వర్గపోరు**
**- రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బాలకృష్ణ రెడ్డి**

**తూప్రాన్, జూన్ 1(జనంసాక్షి):** ఉమ్మడి తూప్రాన్ మండల కాంగ్రెస్ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తూప్రాన్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ఫ్యాక్స్) చైర్మన్ మెట్టు బాలకృష్ణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు ఫ్యాక్స్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేయడం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆయన వెంట పలువురు మాజీ సర్పంచ్‌లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీకి రాజీనామా చేయడంతో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిర్గతమైనట్లు కనిపిస్తున్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం,గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు, ప్రజలకు న్యాయం జరగని పార్టీలో కొనసాగడం తన ఆత్మగౌరవానికి విరుద్ధమని పేర్కొన్నారు.

**రైతుల సమస్యలపై మండిపాటు...**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని బాలకృష్ణ రెడ్డి ఆరోపించారు. వరిసాగు విస్తీర్ణం, దిగుబడులపై పూర్తి సమాచారం ప్రభుత్వ శాఖల వద్ద ఉన్నప్పటికీ కొనుగోలు ప్రక్రియను సమర్థంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా లారీలు లేకపోవడం, ధాన్యం నిల్వలపై సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో సిండికేట్ వ్యవస్థ నడుస్తోందని ఆరోపిస్తూ, లోడింగ్, అన్‌లోడింగ్, తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. రైతు చెమటను కొందరు మధ్యవర్తులు, అధికార యంత్రాంగం కలసి దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని మండిపడ్డారు.

**నర్సారెడ్డి వైఖరిపైనే అసంతృప్తి...**

గజ్వేల్ కాంగ్రెస్ ఇంచార్జి తూముకుంట నర్సారెడ్డి వ్యవహారశైలి వల్లే తాను రాజీనామా చేయాల్సి వచ్చిందని బాలకృష్ణ రెడ్డి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలకు ఆహ్వానించినా హాజరుకాలేదని, అనంతరం సంబంధిత బాధ్యులకు సమాచారం ఇవ్వకుండా కేంద్రాలను సందర్శించి ఫోటోలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించారు.

నియోజకవర్గంలో కొందరిని ప్రోత్సహిస్తూ వర్గ రాజకీయాలకు తెరలేపారని, పార్టీని బలోపేతం చేయడం కంటే వ్యక్తిగత ఆధిపత్యాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పదవుల పంపిణీలో పారదర్శకత లేకుండా వ్యవహరించారని, డబ్బుల ప్రాధాన్యత పెరిగిందనే ఆరోపణలు కూడా చేశారు.

**ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నలు...**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాలకృష్ణ రెడ్డి ఆరోపించారు. రైతు భరోసా, ఎరువుల సరఫరా, వ్యవసాయ మద్దతు వంటి అంశాల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు.

రైతుబంధు చెల్లింపుల్లో జాప్యం, యూరియా కొరత, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో వైఫల్యం వంటి అంశాలు రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు.

**మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు...**

నాగులపల్లి మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానంపై తమకు ఎలాంటి అసంతృప్తి లేదని, కానీ స్థానిక నాయకత్వం వల్లే కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరిన తమలాంటి వారిని పట్టించుకోలేదని ఆరోపించారు. నియోజకవర్గ స్థాయిలో పదవుల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, పార్టీ సిద్ధాంతాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చారని








విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో కొనసాగడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో సహకార సంఘాలు, గ్రామస్థాయి రాజకీయాల్లో ప్రభావం కలిగిన నాయకులు ఒకేసారి పార్టీని వీడటం కాంగ్రెస్‌కు రాజకీయంగా ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రైతు సమస్యల నేపథ్యంలో వెలువడిన ఈ అసంతృప్తి భవిష్యత్తులో మరింత మంది నాయకుల రాజీనామాలకు దారితీస్తుందా అనే చర్చ మొదలైంది. అయితే ఈ ఆరోపణలపై కాంగ్రెస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. గజ్వేల్ నియోజకవర్గంలో ఇప్పటికే వర్గపోరు ఉందనే ప్రచారానికి తాజా పరిణామాలు మరింత బలం చేకూర్చినట్లయ్యాయి. ఈ సమావేశంలో ఫ్యాక్స్ డైరెక్టర్ పట్లోరి శేఖర్ రెడ్డి, రమేష్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల కాంగ్రెస్ మాజీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**- జూన్ 1 నుంచి 12 వరకు ప్రత్యేక కార్యక్రమాలు**

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి ప్రతినిధి జూన్ 01(జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పర్యావరణ అవగాహన, ప్రకృతి సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అటవీ శాఖ అధికారితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్ కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థలలో క్విజ్ పోటీలు, పర్యావరణ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో పర్యావరణ అవగాహన సదస్సులు, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వనమహోత్సవం, అధిక సాంద్రతతో మిశ్రమ మొక్కల నాటకం, గృహావసర మొక్కల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే మంజీరా వన్య ప్రాణి అభయారణ్యం, కమలాపూర్ సరస్సు ప్రాంతాల్లో ప్రకృతి సందర్శన కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా పర్యావరణ హిత ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటడం, అటవీ అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు మంజీరా పర్యావరణ విద్యా కేంద్రం, అటవీ నర్సరీ, వన దర్శిని కేంద్రాలకు ఎక్స్‌పోజర్ విజిట్లు నిర్వహించి ప్రకృతి, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

జూన్ 12న జరిగే ముగింపు కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు,విద్యార్థులు, పాఠశాలలకు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిపౌరుడి బాధ్యతని, జిల్లాలో ప్రజలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశం అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం కోసం కృషి చేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుభీమా డబ్బుల వివాదం..

## కన్నతల్లిని హత్య చేసిన కుమారుడు



**- నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించిన న్యాయస్థానం**

**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

**మెదక్ జూన్ 1(జనంసాక్షి):** రైతుభీమా డబ్బుల విషయంలో తలెత్తిన వివాదం కారణంగా కన్నతల్లిని కత్తితో హత్య చేసిన కుమారుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. హవేళీఘనపూర్ మండలంతో గిట గ్రామానికి చెందిన పుష్టి నర్సమ్మ, లచ్చయ్య దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. నర్సమ్మ తల్లి పుష్టి బాలమణి మరణించడం, రెండో కుమారుడు అనారోగ్యంతో మృతి చెందడం నేపథ్యంలో రైతుభీమా డబ్బుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తరచూ విభేదాలు నెలకొనేవి. ఈ క్రమంలో నర్సమ్మ కుమారుడు పుష్టి బాను ప్రసాద్ డబ్బుల విషయమై తల్లితో గొడవపడ్డాడు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో 2023 ఆగస్టు నెలలో ఆగ్రహానికి లోనైన బాను ప్రసాద్ కత్తితో తల్లిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి హవేళీఘనపూర్ ఎస్ఐ ఆనంద్ గౌడ్ కేసు నమోదు చేశారు. అనంతరం మెదక్ రూరల్ సీఐ విజయ్ కుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ జార్జ్ కేసు విచారణ సందర్భంగా సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర ఆధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ, నిందితుడు పుష్టి బాను ప్రసాద్‌పై అభియోగాలు రుజువైనట్లు నిర్ధారించారు. దీంతో అతనికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని జిల్లా ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన దర్యాప్తు అధికారులు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, ప్రాసిక్యూషన్ బృందాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



**ఉప్పునుంతల,(జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని కొరటికల్, రాయిచేడ్ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సోమవారం ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారుడు గొడుగు తిరుపతయ్య, గ్రామ సర్పంచ్ తోళ్ల లలిత ఆనంద్, డిప్యూటీ సర్పంచ్ గోరటి విజయ ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందించిన ఎమ్మెల్యే, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

అదే విధంగా మామిళ్లపల్లి గ్రామంలో సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించగా ఉప్పునుంతలలో గ్రామ సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వెల్టూరు గ్రామంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాయిచేడ్ గ్రామంలో ఇటీవల ప్రమాదానికి గురైన బోడ మల్లయ్యను ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

తదుపరి రాయిచేడ్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న నూతన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కట్ట అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి, హౌసింగ్ ఏఈ, ఎంపీఓ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడాలి

**- పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని**

**- ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని యువత అలవాటు చేసుకోవాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, జూన్ 1 (జనంసాక్షి):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (31 మే 2026) సందర్భంగా జిల్లాలో పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వైద్య, విద్య, రవాణా, పోలీస్, అధికారులుతో కలెక్టర్ ప్రతి మాసింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూపొగాకు మరియు పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని, క్యాన్సర్, గుండె జబ్బులు, పక్షవాతం, ఊపిరితిత్తుల వ్యాధులు, నోటి సంబంధిత వ్యాధులు మరియు అకాల మరణాలకు ప్రధాన కారణమవుతుందని తెలిపారు. అలాగే, పొగ త్రాగని వ్యక్తులు కూడా పరోక్ష ధూమపానం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతా రని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలలు కళాశాలల వద్ద పాన్ బడ్డీలు ఉంటాయని అక్కడ పొగాకు ఉత్పత్తులు లేకుండా పోలీస్ శాఖ విద్యాశాఖ సమన్వయంతో పగడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. పొగాకు రహిత సమాజ నిర్మాణం కోసం ఆరోగ్య శాఖ నిరంతరం అవగాహన కార్యక్రమాలు, చట్ట అమలు చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎస్పీ ప్రసన్నకుమార్, నాన్-కమ్యూనికేబుల్ డిసీజ్ ప్రత్యేక అధికారి డాక్టర్ జ్ఞానేశ్వర్, సీఎం ఓ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డిడబ్ల్యువో హేమ భార్గవి, డిపిఆర్ఓ రామచంద్ర రాజు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- చిట్యాలలో కనువిప్పు కళా ప్రదర్శన**



**చేర్యాల, జూన్ 01(జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవి కుమార్ తెలంగాణ సాంస్కృతిక సారథి సంయుక్త ఆధ్వర్యంలో చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదాల నివారణ సైబర్ నేరాలపై పోలీస్ కనువిప్పు సారథి కళాబృందం ద్వారా ప్రజలను చైతన్య పరచగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేర్యాల పోలీస్ స్టేషన్ ఏ ఎస్ఐ నవీన్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని బ్యాంకు అధికారులు అని ఫోన్ చేస్తే నమ్మవద్దు అని అకౌంట్ డీటెయిల్స్ పర్సనల్ గుర్తుతెలియని వ్యక్తులకు షేర్ చేయవద్ద సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. యువత బెట్టింగ్ లకు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని విలువైన జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు బాధ్యత నేర్పించాలని ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 100 కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానకి లీల స్వామి, పోలీస్ కనువిప్పు బృందం బాలు, రాజు, తిరుమల, సారథి టీమ్ లీడర్ శ్యామ్ సుందర్, తెలంగాణ సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం, దూల్మిట్ట గెంటే హరిప్రసాద్, సనువాల కనుకయ్య, ఎల్ల సిద్దులు, తండ బిక్షపతి, పన్నీరు శ్రీనివాస్, శైలజ తదితరులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## మోటారు బిగింపు .. కాలనీ వాసులు హర్షం



**పాపన్నపేట, జూన్ 1 (జనంసాక్షి) :** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో పాపన్నపేటకు రెండు నూతన బోరు మోటర్లు వచ్చినట్లు పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ తెలిపారు. సోమవారం గ్రామం లోని బుడగ జంగం కాలనీలో వార్డు సభ్యులతో కలిసి ఆమె బోరు మోటారు ను ప్రారంభిం చారు. నీటి సరఫరా కావడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్,వార్డు సభ్యులు, నాయకులు.. శ్రీను, శ్రీరామ్ దుర్గయ్య, చోటు,రాజు,కిష్టయ్య,దోసని సంగమేశ్వర్, శివయ్య, ప్రవీణ్ గౌడ్ ,పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు



**సదాశివపేట జూన్ 01 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని ఫయాజ్‌నగర్-మోమిన్‌పేట్ రోడ్డు ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని మాజీ కౌన్సిలర్ చౌదరి ప్రకాష్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణి కార్యక్రమంలో ఆధారాలతో కూడిన ఫిర్యాదు అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 414లోని కమ్మరి కుంటకు చెందిన సుమారు రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా భారీ షెడ్ నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై గత నెల 20న సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌తో పాటు తహసీల్దార్‌కు ఫొటోలు, ఇతర ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఫిర్యాదులు చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూమిపై జరుగుతున్న ఆక్రమణలను అరికట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్



**నర్సాపూర్, జూన్ 1 (జనంసాక్షి):** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 2,4,12,14, వార్డులలో సిసి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సాపూర్ మున్సిపాలిటీలోని అన్నివార్డులలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాల ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యం అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ ,వైస్ చైర్మన్ బుచ్చేస్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, కౌన్సిలర్ సుధీర్ గౌడ్, దావుద్, ఇలియాస్ ఖాన్, చింతకుంట శ్రీకాంత్, నిరంజన్ దాస్, సరళ ఆంజనేయులు గౌడ్, రవి, బాల్ రెడ్డి, షేక్ హుస్సేన్, కండెల్ల రాజు, మోహిజ్ పాల్గొన్నారు.

## నాలుగు రోజుల్లో పూర్తి చేయండి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు ఆదేశాలు
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి



**నర్సాపూర్, జున్ 1 (జనంసాక్షి):** నాలుగు రోజుల్లో ధ్యానం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారులను అదేశించారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నాను. 20 రోజులుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన ఇంతవరకు కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వెంటనే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కు ఫోన్ మాట్లాడారు.. వచ్చే నాలుగు రోజుల్లో రోజుకు నాలుగు లారీల చొప్పున పంపించి ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు మల్లేశం, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బచ్చేష్ యాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్.రమేష్‌కు ఘనంగా సన్మానం



**గద్వాల నడిగడ్డ,జూన్ 1 (జనంసాక్షి);** వెటర్నరీ డాక్టర్ యు.ఆర్..రమేష్‌కి సోమవారం జిల్లా కేంద్రంలోని వెటర్నరీ కార్యాలయంలో వీడ్కోలు సమావేశంలో ఘనంగా ప్రజా సంఘాల నాయకులు, సిబ్బంది, మిత్రులు ఘనంగా సన్మానించారు. బదిలీల్లో బాగంగా మహబూబ్ నగర్ కు బదిలీపై వెళుతున్న వెటర్నరీ అడిషనల్ డైరెక్టర్ డాక్టరు యు.ఆర్.రమేష్‌కు వివిధ ప్రజా సంఘాలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, సీనియర్ పాత్రికేయులు పెద్ద ఇస్మాయిల్, ప్రజా ఫ్రంట్ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోశాధికారి శంకర ప్రభాకర్, పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండి సుభాన్, టీచర్ షబ్బీర్, రైతాంగ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోపాల్, వెటర్నరీ అసిస్టెంట్లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రజలకు అందించే ఆరోగ్య సేవలు బేష్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

- నిరుపేదలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా అడుగులు
- ఆరోగ్య పరీక్షల నిర్వహించుకున్న కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జూన్ 1 (జనంసాక్షి):** కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సౌజన్యంతో మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరము, నిర్వహించారు. మేడ్చల్ మెడిసిటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసమైన వారికి ఉచిత మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ అదనపు కలెక్టర్ నగేష్ వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆదర్శంగా నిలిచారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...** నిరుపేదలందరికి సంపూర్ణ ఆరోగ్యం అందించే దిశగా రెడ్ క్రాస్ సొసైటీ ముందుకు వచ్చిందని ఈరోజు వైద్యశిబిరం ఏర్పాటుచేసి జిల్లా అధికారులతో పాటు ప్రజలకు అన్ని పరీక్షలు నిర్వహించుకున్నారని, అలాగే ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.శ్రీరాం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి శ్రీనివాస్ శర్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.శ్రీనివాస్ రావు, మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు దేమే యాదగిరి, ఎస్సై సత్యనారాయణ, సభ్యులు శంకర్‌దయాళ్ చారి, తోట శ్రీనివాస్, వేణు పాల్గొని పేషంట్లకు సేవలందించారు.

## ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన కౌన్సిలర్ మమత




**సదాశివపేట జూన్ 1(జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ఆధ్వర్యంలో నిర్వహించారు. మార్కండేయ స్లం సమైఖ్యకు చెందిన డ్వాక్రా మహిళల సమక్షంలో పీఎంఆర్ గణేష్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అర్హులైన మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ పులి మామిడి మమత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అందిస్తున్న ఇందిరమ్మ చీరలు నాణ్యంగా, అందంగా రూపొందించారని పేర్కొన్నారు. ప్రతి మహిళ ఆనందంగా ధరించేలా చీరలను తయారు చేయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని వినూత్న ఆలోచనలతో ఈ పథకాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రతి ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు కొత్త వస్త్రాలు అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 12వ వార్డు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్‌పి రుమాండ్ల శారద, ఎస్‌హెచ్‌జీ (ఓబీ) మాలె అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు స్రవంతి, కవిత, రాణి, ఈశ్వరమ్మ, అనంత, రుక్కమ్మ, శైలజ, లక్ష్మి, ఆరిఫా, ఫాతిమా, గౌసియా బేగం, మల్లికా బేగం, నసీమ బేగం, తాయెరా బేగం తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చీరలు అందుకున్న మహిళలు రాష్ట్ర ప్రభుత్వానికి, కౌన్సిలర్ మమతకు కృతజ్ఞతలు తెలిపారు.

## నారాయణపేట లో ఉద్రిక్తత...

- లవ్ జిహాద్‌కు మైనర్ బాలిక బలి
- పేట బంద్ విజయవంతం
- నిందితుడిని కఠినంగా శిక్షించాలి...బాలిక కుటుంబానికి న్యాయం చేయాలి
- హిందూ సంఘాల డిమాండ్
- భారీ పోలీసు బందోబస్తు



**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 1(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రం సోమవారం ధర్నాలు, పట్టణ బంద్‌తో అట్టుడికి పోయింది. ఆదివారం 11 గంటల యాభై నిమిషాలకు స్థానిక కురువ గేరి వీధిలో నివసిస్తున్న మైనర్ బాలిక వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన అశ్విని తన నివా సంలో ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకోవడం జరిగిం ది. వివరాల్లోకి వెళితే గత కొంతకాలంగా మైనర్ బాలి కను ప్రేమ పేరుతో లోభర్చు కొని తీవ్ర వేధింపులకు గురి చేస్తూ, లవ్ జిహాద్ పేరుతో అనేకసార్లు కామ వాంఛ తీర్చుకుంటూ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేయడంతో పాటు మతం మార్చుకోవాలని ఒత్తిడి తీసు కురావడంతో అమ్మాయి తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**బస్ డిపో వద్ద ఉద్రిక్తత...**

లవ్ జిహాద్‌కు బలి అయిన బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించి న బంద్‌లో భాగంగా హిందూ సంఘాల నాయకులు, బిజెపి నాయకులు, వాల్మీకి సంఘం నాయకులు ఆర్టీసీ బస్సులు కదలకుండా డిపో ముందు బైఠాయించారు.దాంతో పోలీసులు బస్సులను వదిలేందుకు ప్రయత్నించడంతో వాగ్వాదం జరిగింది.దాంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలీసులు ఎట్టకేలకు బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీతో పాటు, కౌన్సిలర్ల ,హిందూ సంఘాల నాయకులు, వాల్మీకి సంఘం నాయకులను అరెస్ట్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో యధావిధిగా మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులు నడిచాయి.

**బంద్ విజయవంతం....**

మైనర్ బాలిక ఆత్మహత్యకు కారకుడైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం హిందూ సంఘాలు విఎచ్‌పి, భజరంగ్‌దల్, వాల్మీకి సంఘం,బిజెపి ఇచ్చిన బంద్ పిలుపు మేరకు నారాయణపేట బంద్ విజయవంతం అయింది. ఈ బంద్‌తో వ్యాపార కేంద్రాలు, విద్యా సంస్థలు, బ్యాంకులు, హోటళ్ళు,పాన్ డబ్బాలు సైతం స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌కు మద్దతు పలకడంతో బంద్ విజయవంతం అయింది.బంద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.బంద్ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమయపాలన పాటించాలి

### వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని లలితా దేవి

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కె. లలితాదేవి ప్రభుత్వ డాక్టర్లకు సూచించారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట్ ఏరియా ఆసుపత్రి, తాలేల్మ, నేరేడిగుంట పీహెచ్‌సీలను వైద్యాధికారిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది విధులకు సమయానికి హాజరవుతున్నారా లేదా అనే అంశాన్ని అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వివిధ విభాగాలను సందర్శించి పరిశీలించారు. ఆయా ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందుల నిల్వలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, గడువు ముగిసిన (ఎక్స్‌పైరీ) మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని, వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు సిబ్బంది సమయం పాలనపాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు.






# రైతులతో కలిసి బైఠాయించిన అంజిరెడ్డి

**మెదక్ జూన్ 1 (జనంసాక్షి)** రైతులు పండించిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ ఐకేపీ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత, ఆందోళన నెలకొంది. రైతుల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, వారితో కలిసి ఐకేపీ సెంటర్ వద్ద బైఠాయించారు. ఐకేపీ కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా అధికారులు కొనుగోలు చేయకపోవడం, లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ అంజిరెడ్డి రైతులతో కలిసి అక్కడికక్కడే ధర్నాకు దిగారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ నినాదాలు చేశారు.













